



# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 215

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

గురువారం 8 జనవరి 2026


## తెలంగాణతో నీటి వివాదాలపై సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు

- సముద్రంలోకి పోతున్న నీటిని ఎవరైనా వాడుకోవచ్చన్న చంద్రబాబు
- కొందరు మాట్లాడుతున్న మాటలు తనకు అర్థం కావడం లేదని వ్యాఖ్య
- రెండు రాష్ట్రాల మధ్య విరోధాలు పెంచొద్దని హితవు
- వైసీపీ అక్రమాలపై దర్యాప్తు చేస్తున్నామని వెల్లడి
- రాయలసీమ ఎత్తిపోతలపై ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని మండిపాటు



**అమరావతి,కలంకౌంటర్ :** ఏపీ సీఎం చంద్రబాబు ఈరోజు పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలించారు. అనంతరం అక్కడే మీడియాతో మాట్లాడుతూ తెలంగాణతో నీటి వివాదాలపై సున్నితంగా, స్పష్టంగా స్పందించారు. గోదావరి నదిలో నీళ్లు పుష్కలంగా ఉన్నాయని, సముద్రంలోకి పోతున్న నీటిని ఎవరైనా వాడుకోవచ్చని చంద్రబాబు అన్నారు. పోలవరం ప్రాజెక్టుకు అభ్యంతరం చెప్పడం సరికాదని, నీటి విషయంలో రాజకీయాలు చేయొద్దని తెలంగాణను కోరారు. "తెలుగు జాతి ఒక్కటే... ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఉండాలి. రెండు రాష్ట్రాల మధ్య విరోధాలు పెంచుకుని ఇతరులు ఆనందించే పరిస్థితి రావొద్దు" అని హితవు పలికారు. కొందరు మాట్లాడుతున్న మాటలు వింటుంటే... ఆ రాజకీయాలేమిటో తనకే అర్థం కావడం లేదని చంద్రబాబు అన్నారు. గోదావరి నది పైభాగంలో దేవాదుల ఉందని... దేవాదుల నుంచి నీళ్లు వస్తే కింద ఉన్న పోలవరానికే వస్తాయని, కిందికి వచ్చే నీళ్లకు అభ్యంతరం చెబితే అర్థమేమీ ఉండదని అన్నారు. తాము ఎప్పుడూ దేవాదులకు వ్యతిరేకం కాదని, తెలంగాణ కాళేశ్వరం ప్రాజెక్టు కడుతున్నప్పుడు కూడా అభ్యంతరం చెప్పలేదని గుర్తు చేశారు. నీళ్లు పొదుపు చేస్తే తెలంగాణకూ లాభమేనని, మిగులు నీటిని శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో నిల్వ చేసుకోవచ్చని సూచించారు. కృష్ణా నదిలో నీళ్లు తక్కువగా ఉండటంతో పైన ప్రాజెక్టులు కడితే నష్టమని, కానీ గోదావరి డెల్టాను కాపాడుకుని కృష్ణా-గోదావరి అనుసంధానం చేస్తే ఇబ్బంది ఉండదని అన్నారు. రాయలసీమ ఎత్తిపోతలపై కొందరు చేస్తున్న వ్యాఖ్యల్లో అర్థం లేదని, అబద్ధాలను వందసార్లు చెబితే నిజమవుతుందని అనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. పోలవరం ఆలస్యంపై గత వైసీపీ ప్రభుత్వాన్ని చంద్రబాబు విమర్శించారు. గత ప్రభుత్వం వల్లే 6-7 ఏళ్లు ఆలస్యమైందని, డయాఫ్రం వాల్ పాడైందని ఐఐటీ హైదరాబాద్ నిపుణులు చెప్పిన తర్వాతే వాళ్లకు తెలిసిందని విమర్శించారు. ఇప్పుడు కొత్తగా డయాఫ్రం వాల్ కడుతున్నామని, ఫిబ్రవరి 15లోపు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. వైసీపీ అక్రమాలపై దర్యాప్తు జరుగుతోందని, కానీ దర్యాప్తు పేరుతో కాలయాపన చేసుకుంటూ పోతే, పనులు పూర్తి చేయడానికి చాలా కాలం పడుతుందని చెప్పారు. అనుమతులు లేని ప్రాజెక్టులకు రూ. 2 వేల కోట్లు ఖర్చు పెట్టారని... ఎన్జీటీకి రూ. 100 కోట్ల జరిమానా కట్టారని దుయ్యబట్టారు.

## భూ మాతను రక్షించుకుంటూ రైతుల ఆదాయం పెంచాలి

- ఉద్యాన సాగులో వైవిధ్యరౌ భూమికి రక్షణ కవచం లాంటిది
- విభిన్న రకాల పంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలి
- 50 శాతం గ్రీన్ కవర్ ప్రణాళికల అమలులో ఉద్యాన శాఖ పాత్ర కీలకం
- అటవీ, ఉద్యాన శాఖ ఉన్నతాధికారులతో చర్చించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్




**విజయవాడ, కలంకౌంటర్ :** భూ మాతను రక్షించుకుంటూ, రైతుల ఆదాయం పెంచే విధంగా ప్రణాళికలకు రూపకల్పన చేయాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. పండ్ల తోటల్లో విభిన్న జాతుల మొక్కలు సాగు చేయడం ద్వారా భూసారాన్ని పెంచడంతోపాటు వాతావరణాన్ని రక్షించుకోవచ్చని తెలిపారు. బుధవారం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో 50 శాతం గ్రీన్ కవర్ ప్రణాళికలపై అటవీ, ఉద్యాన శాఖల ఉన్నతాధికారులతో చర్చించారు. గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, 50 శాతం గ్రీన్ కవర్ అంశాలపై టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చర్యల్లో భాగంగా ఈ సమావేశం జరిగింది. గ్రీన్ కవర్ పెంపులో ఉద్యాన శాఖ పాత్ర, పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్యం తదితర అంశాలపై ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, 2047 నాటికి రాష్ట్రంలో 50 శాతం గ్రీన్ కవర్ సాధన అంశాలను కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అందుకోసం అన్ని ప్రభుత్వ రంగ శాఖలు అటవీ శాఖతో సమన్వయంతో ముందుకు వెళ్లాలి. గ్రీన్ కవర్ ఏర్పాటులో ఉద్యానవన శాఖ పాత్ర కీలకం. ఉద్యాన పంటల సాగులో వైవిధ్యం తీసుకురావడం ద్వారా అటు రైతుకీ, ఇటు భూమికీ ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలి. ఒకే పంటలో వివిధ రకాల జాతుల మొక్కలు అంతర పంటలుగా సాగు చేసే విధంగా రైతులను పోత్సహించాలి. సింథటిక్ మందుల వినియోగం తగ్గించేలా అవగాహన కల్పించాలి. తద్వారా భూమికి చేవ పెరుగుతుంది. జీవవైవిధ్యాన్ని రక్షించుకోవచ్చని అన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ, ఉద్యాన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, రైతు సాధికారిత సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయ్ కుమార్, నాచురల్ ఫార్మింగ్ సొసైటీ డైరెక్టర్ శ్రీనివాసులు, పీసీసీఎఫ్ పి.వి. చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

## పోలవరం పనులపై సీఎం చంద్రబాబు సమీక్ష... నిర్వాసితులపై పూర్తి ఫోకస్ పెట్టాలని ఆదేశం




**అమరావతి,కలంకౌంటర్ :** సీఎం చంద్రబాబు పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిపై దృష్టి సారించారు. బుధవారం ఆయన ప్రాజెక్టు సైట్ వద్ద జలవనరుల శాఖ ఉన్నతాధికారులు, ఇంజనీర్లతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టులో మిగిలిన పనులను గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టులో ఇప్పటికే 87 శాతం సివిల్ పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సీఎం స్పష్టం చేశారు. ముఖ్యంగా ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాసం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పనులపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని ఆదేశించారు. దీనికోసం ప్రత్యేకంగా ఒక యాక్షన్ ప్లాన్ రూపొందించుకుని ముందుకు సాగాలని సూచించారు. అదేవిధంగా పోలవరం ఎడమ కాలువ పనులను వేగవంతం చేయాలని సీఎం తెలిపారు. కుడి కాలువ ద్వారా కొల్లేరు ప్రాంతానికి కూడా నీరందించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని కీలక సూచన చేశారు. ఈ సమీక్ష సమావేశంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, కొలుసు పార్థసారధి, నాదెండ్ల మనోహర్, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వచ్చే మే నెల మొదటి వారంలో తాను మళ్లీ పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిని స్వయంగా తనిఖీ చేస్తానని చంద్రబాబు వెల్లడించారు.

## విశాఖ పార్టీ కార్యాలయంలో మంత్రి నారా లోకేష్ 80వ రోజు ప్రజాదర్బార్

- ప్రజలు, పార్టీ కార్యకర్తల నుంచి విజ్ఞప్తులు స్వీకరణ
- ప్రతి ఒక్కరికి అండగా ఉంటామని మంత్రి హామీ





**విశాఖపట్నం,కలంకౌంటర్ :** విశాఖపట్నం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ 80వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. మంత్రి లోకేష్ ను కలిసేందుకు విశాఖ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రజలు, పార్టీ కార్యకర్తలు తరలివచ్చారు. ప్రతిఒక్కరినీ ఆప్యాయంగా పలకరించిన మంత్రి లోకేష్.. వివిధ సమస్యలపై వారి నుంచి అర్జీలు స్వీకరించారు. విశాఖ 83వ డివిజన్ పరిధిలోని ఏఎంసీ కాలనీలో 192 కుటుంబాలకు రెండు దశాబ్దాల క్రితం ప్రభుత్వం నిర్మించి ఇచ్చిన అపార్ట్ మెంట్లు శిథిలావస్థకు చేరుకున్నాయని, ఇళ్లు పునర్ నిర్మించి తమను ఆదుకోవాలని కాలనీ వాసులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. తలసేమియా వ్యాధిగ్రస్థుల పిల్లల కోసం విశాఖలో కేర్ సెంటర్ నిర్మాణానికి స్థలం కేటాయింపుతో పాటు తగిన నిధులు మంజూరుకు చర్యలు తీసుకోవాలని విశాఖ కారుణ్య స్వచ్ఛాంధ్ర సేవా సంస్థ ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిసి కోరారు. అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం ముషిడిపల్లిలో యాదవ సామాజికవర్గానికి ఇళ్ల స్థలాలు కేటాయింపుతో పాటు కమ్యూనిటీ భవనం నిర్మించాలని గ్రామస్థులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఎలాంటి ఆధారం లేని తనకు కార్యకర్తల సంక్షమ నిధి ద్వారా ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని విశాఖ మద్దిలపాలెం కేఆర్ఎమ్ కాలనీకి చెందిన వెంపాడ స్తుతయ్య విజ్ఞప్తి చేశారు. వారసత్వంగా సంక్రమించిన భూమి మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేయగా వీఆర్వో తిరస్కరించారని, విచారించి తగిన చర్యలు తీసుకోవాలని అనకాపల్లి జిల్లా కే కోటపాడు మండలం, రామయోగి అగ్రహారానికి చెందిన నాగిరెడ్డి గొంగలయ్య కోరారు. ఆయా అర్జీలను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని మంత్రి భరోసా ఇచ్చారు.

## మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయను కలిసిన వాణి వెంకట్



**గుంటూరు, కలంకౌంటర్ :** హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ గుంటూరు కు వచ్చిన సందర్భంగా బిజెపి సీనియర్ నాయకులు జూపూడి రంగరాజు నివాసంలో దత్తాత్రేయను గుంటూరు జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు త్రిపురమల్లు వాణి వెంకట్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ తో రాజకీయ జీవితాన్ని ప్రారంభించి అనేకసార్లు ఎంపీగా, కేంద్రమంత్రిగా, రెండు రాష్ట్రాలకు గవర్నర్ గా అనేక సామాజిక సంస్థల్లో బాధ్యతాయుతమైన పదవులు నిర్వహించిన దత్తాత్రేయ మాలాంటి వారందరికి స్ఫూర్తిదాయకమని, అటువంటి వారిని కలవడం ఎంతో సంతోషంగా ఉందని ఆమె అన్నారు.






## వైఎస్ జగన్ ను కలసిన మాజి ఎమ్మెల్యే అన్నా రాంబాబు,తనయుడు కృష్ణచైతన్య



**తాడేపల్లి,కలంకౌంటర్ :** తాడేపల్లి వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయం నందు మాజి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలసిన మాజి శాసనసభ్యులు,మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇంచార్జి అన్నా రాంబాబు , తనయుడు అన్నా కృష్ణచైతన్య

## ఎం ఎల్ ఎ ఆశీస్సులు తీసుకున్న సాయి



**మాచర్ల,కలంకౌంటర్ :** మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డికి రాష్ట్ర ఆర్యవైశ్య జర్నలిస్టుల సంక్షమ సేవ సంఘం డైరీ అందజేసి ఆశీస్సులు తీసుకున్న రాష్ట్ర ఆర్యవైశ్య జర్నలిస్టుల సంక్షమ సంఘం ఎగ్జిక్యూటివ్ మెంబర్ సముద్రాల పవన్ సాయి.


## ఆర్ఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో వితరణ





**జగ్గయ్యపేట,కలంకౌంటర్ :** ఆర్ఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానికంగా ఉన్న కృష్ణ వికాస్ మహిళా సొసైటీ వృద్ధాశ్రమ నందు వృద్ధులకు ఫౌండేషన్ నిర్వాహకులు చారుగుండ్ల కొండ , పోలంపల్లి రాధా ల ఆధ్వర్యంలో రానున్న సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని పలు పిండి వంటకాలను అరిసెలు సజ్జ బూరెలు కారపూస తదితర తినుబండారాలను సామాజికవేత్త కర్లపాటి వెంకట శ్రీనివాస్ రావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా కర్లపాటి మాట్లాడుతూ ఆర్ఎం టీవీ యాజమాన్యం ఆర్ఎం ఫౌండేషన్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమని పేర్కొన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆశ్రమాన్ని నిర్వహిస్తున్న శ్రీమతి సమాధానాన్ని ఆయన అభినందించారు. సెమీ అర్బన్ ప్రాంతాలలో నిర్వహిస్తున్నటువంటి ఆశ్రమాలకు ప్రభుత్వం సహకారాన్ని అందించాలని ఆయన ఆకాంక్షంచారు. కార్యక్రమంలో రమేష్ వృద్ధులకు దుప్పట్లు అందజేయగా అనిల్ 25 కిలోల బియ్యాన్ని ఆశ్రమ నిర్వాహకులకు అందజేశారు.

## ఏపీలో ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ ప్యానెళ్లు: మంత్రి గొట్టిపాటి రవికుమార్



**అమరావతి,కలంకౌంటర్ :** ఏపీలో సోలార్ రూఫ్ టాప్ పథకానికి టెండర్లు పూర్తయినట్లు ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రకటించారు. ఈ పథకం కింద సామాన్యులకు రూ.78,000 వరకు సబ్సిడీ అందుతుంది. బీసీలకు అదనంగా రూ.20,000, ఎస్సీ, ఎస్టీలకు పూర్తి ఉచితంగా సోలార్ ప్యానెళ్లు అందించేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇదే సమయంలో విద్యుత్ రంగ ప్రైవేటీకరణను కూటమి ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

# మిర్చి ధరల స్థిరీకరణకు ముందస్తు చర్యలు

● మిరప రైతులకు భరోసా....ఇ-క్రాప్ 100% అమలుకు చర్యలు ● రసీదులు, మౌలిక వసతులపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి

● మిర్చి సీజన్‌పై ముందస్తు సమీక్ష సమావేశంలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు





**అమరావతి/గుంటూరు,కలంకౌంటర్ :** మిర్చి ధరల విషయంలో గతేడాది రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న నేపథ్యంలో, ఈసారి అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడానికి సమీక్ష సమావేశం నిర్వహించామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. గుంటూరులోని వ్యవసాయ మార్కెటింగ్ కార్యాలయంలో మిర్చి ధరలపై నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఈ ఏడాది మిర్చి ధరలు ఆశాజనకంగా ఉన్నాయని చెప్పారు. గతేడాది ధరలు అధికంగా ఉండటంతో రైతులు విపరీతంగా మిర్చి సాగు చేశారని, దాని ప్రభావంతో మార్కెట్లో సమస్యలు ఏర్పడ్డాయని వివరించారు. ఎంత విస్తీర్ణంలో మిర్చి సాగు చేస్తే ధరలు నిలకడగా ఉంటాయో రైతులకు అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి స్పష్టంగా సూచించారని మంత్రి తెలిపారు. గత ఏడాది క్వింటాల్ కు రూ.11,750 మద్దతు ధర ఉందని చెప్పారు. ఈ ఏడాది 44 శాతం వరకు ఉత్పాదకత తగ్గిందన్నారు. క్రయ విక్రయాలకు అనుకూల వాతావరణం ఏర్పాటుకు సమావేశం నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. గత ఏడాది 1.96 లక్షల ఎకరాలలో పండించడం జరిగిందని, ఈ ఏడాది 1.06 లక్షల ఎకరాలలో పండించడం జరిగిందని వివరించారు. డిసెంబర్ నుండి జూన్ వరకు పంట మార్కెట్ కు వస్తుందని తెలిపారు. 13.88 లక్షల మెట్రిక్ టన్నుల నిలువ సామర్థం ఉందన్నారు. గత ఏడాది 6.62 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పాదకత ఉండగా, ఈ ఏడాది 5.39 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పాదకత ఉందని చెప్పారు. సీజన్ లో 45 వేల నుండి 55 వేల బస్తాలు మొత్తంగా లక్ష బస్తాలు వస్తాయని తెలిపారు. తేజ రకం మినహా మిగిలిన రకాలకు ధరలు ఆశాజనకంగా ఉందన్నారు. మార్కెట్ ఫీజు రూ.85.37 కోట్లు వసూలైందని తెలిపారు. కొంతమంది రైతులు మిర్చి నుంచి మొక్కజొన్న సాగుకు మళ్లారని తెలిపారు. రైతులు పండించే పంటలకు సరైన ధరలు రాక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని సీఎం చంద్రబాబు పరిశీలించి ధరలను బట్టి పంటలను పండించేలా ఒక క్లస్టర్ విధానాన్ని తీసుకొచ్చేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారని తెలిపారు. వీటిపై రైతులకు పూర్తి అవగాహన కార్యక్రమాలు అదికారులు చేపట్టాలని సూచించారు.

**కోల్డ్ స్టోరేజ్‌లో ఉన్న మిర్చికి రుణాలు..** ఈ ఏడాది కోల్డ్ స్టోరేజ్‌లలో నిల్వ ఉంచిన మిర్చికి రుణాలు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా అన్ని విధాలా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఇతర రా(ష్ట్రాల నుంచి కూడా మిర్చి మార్కెట్ యార్డులకు వస్తోందని, స్థానిక రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా లావాదేవీలపై పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు. మిర్చి సాగు చేసిన రైతుల వివరాలను పూర్తిగా రికార్డు చేస్తున్నామని, నూటికి నూరు శాతం ఇ-క్రాప్ నమోదు జరుగుతోందని మంత్రి స్పష్టం చేశారు. అలాగే నల్లి తామర వైరస్ వ్యాప్తిని అడ్డుకునేందుకు తగిన నివారణ చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. కంప్యూటర్ వెయిట్ మిషన్ లు ప్రస్తుతం 100 మాత్రమే అందుబాటులో ఉన్నాయని వాటి సంఖ్యను మరింత పెంచేలా వెంటనే చర్యలు చేపట్టాలని అధికారును మంత్రి ఆదేశించారు. రైతులకు తప్పనిసరగా రసీదులు అందచేయాలని చేయని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రవాణాకు ధర నిర్ణయించడం జరుగుతుందని, అంతకంటే తక్కువ ధరకు వచ్చిన వారిని అడ్డుకోవద్దని కోరారు. కోల్డ్ స్టోరేజ్ లలో ఉన్న సరుకు కూడా మిర్చి యార్డుకు రావాలని ఆయన స్పష్టం చేశారు.

**మిర్చియార్డ్ లో ఇబ్బందులు లేకుండా రైతులకు సౌకర్యాలు..** మిర్చి మార్కెట్ యార్డుల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు ఏర్పాటు, మరుగుదొడ్లు శుభ్రపరచటం, విశ్రాంతి కొరకు బెడ్ షీట్స్ ఏర్పాటు, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం, తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఈ సారి సీజన్ ముందుగా రావడం వలన రైతులకు అన్నదాన కార్యక్రమం ముందస్తుగానే మొదలు చేసేందుకు ప్రణాళిక రూపొందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. మార్కెట్ లో ఉన్న పోటీ ధరలు చెల్లించాలని రవాణా సంఘం ప్రతినిధులు మంత్రిని కోరారు. ఆకస్మిక వర్షాలు కురిస్తే మార్కెట్ యార్డులో ఉన్న బస్తాలు తడిసి పోతున్నాయని ఇందుకు ప్రత్యాహ్నాయ ఏర్పాట్లను చేయాలని రైతులు మంత్రిని కోరారు. రైతులకు మేలు చేసేందుకు కూటమి ప్రభుత్వం ఎప్పుడు సిద్ధంగా ఉంటుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ ఎం. విజయ సునీత, శాసన సభ్యులు నసీర్ అహ్మద్, గల్లా మాధవి, డి.సి.సి.బి చైర్మన్ హరిబాబు, ఎగుమతిదారులు, రైతులు, కొనుగోలుదారులు, కమిషన్ ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# నేటి (జనవరి 8) నుండి 'ఆవకాయ్ -అమరావతి సినిమా, కళా, సంస్కృతి, సాహిత్యోత్సవం'

● రాష్ట్ర పర్యాటక శాఖ, టీమ్ వర్క్స్ ఆర్ట్స్ సంయుక్త నిర్వహణలో 3 రోజుల పాటు ఆవకాయ్ అమరావతి ఉత్సవాలు ● తెలుగు సినిమా, సాంస్కృతిక, కళా, సాహిత్య వైభవాన్ని ప్రపంచానికి చాటడమే లక్ష్యంగా విజయవాడలోని పున్నమి ఘాట్, భవాని ద్వీపంలో సర్వాంగ సుందరంగా వేడుకలు ● కనువిందు చేయనున్న సినిమా ప్రదర్శనలు, సాహిత్య చర్చలు, కవితా పఠనాలు, సంగీతం, నృత్యం, నాటకాలు, వర్క్ షాప్ లు, సాంస్కృతిక భాషణలు, ఆధునిక కళా ప్రదర్శనలు● సందర్శకులకు ప్రవేశం ఉచితం..ప్రేక్షకులు ఆన్ లైన్ వేదికగా www.avakaifestival.com లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించిన నిర్వాహకులు ● మంత్రి కందుల దుర్గేష్ ఆధ్వర్యంలో ఏర్పాట్ల ప్రక్రియ దిగ్విజయంగా పూర్తి చేసిన పర్యాటక శాఖ ఎండీ ఆమ్రపాలి కాట, అధికారులు







**విజయవాడ, కలంకౌంటర్ :** విజయవాడ నగరం అద్భుతమైన కళా సంబరానికి ఆతిథ్యం ఇచ్చేందుకు ముస్తాబైంది. సాహిత్యం, కళాకారులు, సాంస్కృతిక సంప్రదాయాలకు నిలయంగా విరాజిల్లుతోన్న ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ఘనమైన వారసత్వాన్ని, భాషా ప్రాభవాన్ని, కళా వైభవాన్ని జరుపుకోవడానికి 'ఆవకాయ్ – అమరావ తి సినిమా, సంస్కృతి, సాహిత్యోత్సవం' సిద్ధమైంది.సీఎం నారా చంద్రబాబు నాయుడు చొరవతో, మంత్రి కందుల దుర్గేష్ నేతృత్వంలో రాష్ట్ర పర్యాటక శాఖ, 'టీమ్‌వర్క్ ఆర్ట్స్' సంయుక్తంగా తెలుగు సినిమా, సాంస్కృతిక, సాహిత్య వైభవాన్ని ప్రపంచానికి చాటడమే లక్ష్యంగా విజయవాడ వేదికగా కృష్ణా నది తీరాన ఉన్న పున్నమి ఘాట్ మరియు భవానీ ఐలాండ్ లో నేటి (జనవరి 8) నుండి ఆవకాయ్ అమరావతి ఉత్సవాలు 3 రోజుల పాటు(జనవరి 10 వరకు) ప్రజలను కనువిందు చేయనున్నాయి. సినిమా ప్రదర్శనలు, సాహిత్య చర్చలు, కవితా పఠనాలు, సంగీతం, నృత్యం, నాటకాలు, వర్క్ షాప్ లు, సాంస్కృతిక భాషణలు, ఆధునిక కళా ప్రదర్శనలతో కార్యక్రమం ఆద్యంతం ఆహ్లాదకరంగా సాగనుంది. సందర్శకులకు ప్రవేశం ఉచితం..మంత్రి కందుల దుర్గేష్ ఆధ్వర్యంలో పర్యాటక శాఖ ఎండీ ఆమ్రపాలి కాట, అధికారులు ఏర్పాట్లను దిగ్విజయంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్, ఎండి ఆమ్రపాలి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, టీం వర్క్స్ ఆర్ట్స్ ప్రతినిధి సయ్యద్ శ్యామ్స్ జావిద్ తదితరులు పున్నమి ఘాట్, భవాని ఐలాండ్ లలో పర్యటించి ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా హౌస్ బోట్లు, రొమాంటిక్ ఫ్లోట్ అండ్ డైన్ ను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ట్రయల్ రన్ గా ప్రారంభించిన అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నదీ తీరాల్లో ఈ తరహా హౌస్ బోట్స్ ప్రారంభిస్తామని తెలిపారు. రాష్ట్రాన్ని ప్రపంచ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే తమ లక్షమన్నారు. సాంకేతికతతో కూడిన ఆర్థిక వృద్ధిని సాధిస్తూనే, రాష్ట్ర సంస్కృతిని కాపాడుకోవాలనే ముఖ్యమంత్రి చంద్రబాబునా యుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల దూరదృష్టికి ఈ ఉత్సవం ఒక నిదర్శనమని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఈ ఫెస్టివల్ లో సినిమా, సాహిత్య రంగాలకు చెందిన దిగ్గజాలు, ప్రపంచవ్యాప్త కళాకారులు పాల్గొననున్నారు. ప్రధానంగా హెరిటేజ్ వాక్ తో పాటు ఘాట్ ఫెర్రీ ప్రయాణం, ఫుడ్ ఫెస్టివల్ తదితర కార్యక్రమాలు జరగనున్నాయి. ప్రముఖ గాయకులు జావేద్ అలీతో సంగీత కచేరి ఉండనుంది. వైవిధ్యభరితమైన సాంస్కృతిక ప్రదర్శనలు, సినిమా చర్చలు మరియు సాహిత్య గోష్టులు సందర్శకులను అలరించను న్నాయి. ఈ సందర్భంగా రాష్ట్రం సాధించిన పురోగతిని, సాంస్కృతిక మూలాలను ప్రపంచానికి చాటిచెప్పేలా ఈ వేదికను రూపొందించడం విశేషం. మూడు రోజుల పాటు జరిగే ఆవకాయ్ అమరావతి ఉత్సవానికి సందర్శకులు భారీ సంఖ్యలో హాజరుకానున్న నేపథ్యంలో పర్యాటకుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ పకడ్బందీ ఏర్పాట్లు జరిగాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్ల ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు. నిర్వాహకులు సందర్శకులకు ప్రవేశం ఉచితంగా కల్పించారు. ఈ సందర్భంగా ఉత్సవాన్ని విజయవంతం చేయాలని పర్యాటక శాఖ పిలుపునిచ్చింది. నేడు (జనవరి 8) సాయంత్రం 4.45 గం.లకు భారీ తోలుబొమ్మలాట, డ్రమ్స్ ప్రదర్శనతో ప్రారంభోత్సవం ఊరేగింపు కార్యక్రమం జరుగుతుంది. అనంతరం జమ్మెర్స్ వారిచే సంగీత ప్రదర్శన, పున్నమి ఘాట్ దగ్గర హారతి కార్యక్రమం ఉంటుంది. ఒమాజియో పెర్ఫార్మింగ్ కంపెనీ వారి హర్ ఫ్రేమ్స్, హర్ ఫైర్ కార్యక్రమం ఉండనుంది. అనంతరం 7.50 గం.లకు ముఖ్య అతిథులతో ఉత్సవం ప్రారంభం అవుతుంది. కార్యక్రమంలో సీఎం చంద్రబాబునాయుడుతో పాటు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, యూరోపియన్ యూనియన్ రాయబారి హెచ్.ఇ.హెర్వే డెల్ఫిన్, టీమ్ వర్క్ ఆర్ట్స్ పాలనాధికారి సంజయ్. రాయ్ పాల్గొననున్నారు. ఆ తర్వాత రాత్రి 8.30 నుండి 10 గం.ల వరకు ప్రేమ కథ సంగీత నాటకంతో తొలిరోజు కార్యక్రమం ముగుస్తుంది. రెండవ రోజు(జనవరి 9) ఉదయం 11 గం.ల నుండి భవానీ ఐల్యాండ్ లో, సాయంత్రం 5 గం.ల నుండి పున్నమిఘాట్ లలో వేడుకలు జరుగనున్నాయి. భవానీ ద్వీపంలో సినిమాల్లో ప్రతినాయకుల పాత్రపై జరిగే చర్చలో ఎస్.హుస్సేన్ జైదీ, యండమూరి వీరేంద్రనాథ్, సుధీర్ మిశ్రాలు పాల్గొంటారు. అదే విధంగా తుహెూన్ ఆదిత్యరాయ్ తో మార్షల్ ఆర్ట్స్ పై శిక్షణా శిబిరం నిర్వహించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 12 గం.లకు భారతీయ పురాణాలు, కథ చెప్పే విధానంలో పరిణామక్రమం అంశంపై బ్నిం, కస్తూరి మురళీకృష్ణ,సంజీవ్ పస్రిచా, మొతాలీ అనురాధలు సంభాషి స్తారు. ప్రముఖ నగాడా వాయిద్యకారులు నాథులాల్ సోలంకితో నగడా శిక్షణా శిబిరం నిర్వహించబడుతుంది. మధ్యాహ్నం స్టోరీ అవర్ యూకే వారిచే సంగీత, మాటలతో సార్వత్రిక కథలపై కథ కాలపేక్షం నిర్వహిం చనున్నారు. ప్రముఖ తోలుబొమ్మలాట కళాకారుడు షమీమ్ తో తోలుబొమ్మ ల తయారీలో శిక్షణ ఉంటుంది. ఓటీటీ యుగంలో సినిమా అంశంపై లీనా యాదవ్, శిబిశిష్ సర్కార్, సౌగుట ముఖర్జీ, సుప్రియ యార్లగడ్డ, సునీల్ చైనాని, శ్రీరూపా మిత్ర చర్చిస్తారు. ప్రఖ్యాత ఫ్రెంచ్ నృత్య కళాకారులు గిల్లెస్ చుయెన్ తో డాన్స్ శిక్షణా శిబిరం నిర్వహిస్తారు. నవల నుండి సినిమా వరకు వల్లి పద్మాంజలితో యండమూరి వీరేంద్రనాథ్, ఎ.కోదండరామిరెడ్డి సంభాషిస్తారు. అనంతరం సాయంత్రం గం.ల నుండి పున్నమిఘాట్ లో చందన బాల కళ్యాణ్ గారెచే కర్ణాటక, అధ్యాత్మిక సంగీత విభావరి జరుగనుంది. ఆ తర్వాత వనశ్రీ రచించిన 'రస' ఐక్యం కూచిపూడి నృత్యం నాటకీయ కథ ప్రదర్శించబడుతుంది. శ్యామ్ రక్షంద జలీల్ తో ప్రియ సారయ్యా, శేఖర్ రావ్జాని, కాసర్ల సంభాషణ, ప్రియ సరైయ లతో సినిమాల్లో సంగీతం, కవిత్వం అంశంపై చర్చ జరగనుంది. అనుభూతినిచ్చే ముషైరా పై అజర్ ఇక్బాల్, ఇక్బాల్ అష్హర్, ఖుష్బీర్ సింగ్ షాద్, డా. నుస్రత్ మెహదీ, పాయల మురళీకృష్ణ, పాపులర్ మెరతి, సైఫ్ నిజామి, సర్దార్ ఖలీమ్ లు చర్చించనున్నారు. అనంతరం ఆజ్ రంగ్ హై . శ్రీనివాసరావు, ఆచార్య జయప్రద, ఆచార్య తడకమళ్ల విజయ్ కుమార్ లచే సంగీత విభావరి ఉండనుంది. మూడవ రోజు(జనవరి 10) కథ కాలక్షపం తో పాటు నీటిపై రాతలు అంశంపై తెలుగులో కథ చెప్పే కళశ్రీ కరుణతో బ్నిం, సన్నపురెడ్డి వెంకట్రామిరెడ్డితో చర్చా కార్యక్రమం ఉంటుంది.సినిమా మరియు పాత్రికేయ వృత్తి అంశంపై చల్లా భాగ్యలక్ష్మితో వర ముళ్లపూడి, వడ్డి ఓం ప్రకాష్ నారాయణల మధ్య సంభాషణ ఉంటుంది. తెలుగు సాహిత్యం, సినిమా వైభవంపై మోతాలీ అనురాధతో కస్తూరి మురళీకృష్ణ, మామిడి హరికృష్ణ, శ్రీపతి వర్మ వేదాంతం ల మధ్య సంభాషణ ఉంటుంది. అనంతరం పదాలకు సరిహద్దులు లేవు అనే అంశంపై చర్చ ఉంటుంది. సాయంత్రం పున్నమి ఘాట్ లో చౌరస్తా వారిచే సంగీత ప్రదర్శన,టి.డి జనార్ధన్, స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, బుర్రా సాయిమాధవ్, తేజస్వి పొడపాటి చేతుల మీదుగా నట సార్వభౌమ ఎన్టీఆర్ నట విశ్వరూపానికి నివాళులు అర్పించే కార్యక్రమం జరుగనుంది. ఆ తర్వాత ప్రేమ కథ సంగీత నాటకం ప్రదర్శన 9 గం.లకు ఉత్సవం ముగుస్తుంది.పున్నమి ఘాట్ లో రాత్రి 11 గం.లకు కార్యక్రమం పరిసమాప్తమవుతుంది.

# తెలంగాణ సమాగ్రాభివృద్ధికి జాగృతి బ్లూప్రింట్

● పుష్కరకాల తెలంగాణ రాష్ట్రం - సంపూర్ణ అధ్యయనం సహా అన్ని కీలక అంశాలపై స్టడీ ● రాజకీయ పార్టీల రాజ్యాంగాల అధ్యయనానికి ప్రత్యేక కమిటీ

● ఈనెల 17న జాగృతి స్టీరింగ్ కమిటీకి నివేదిక ఇవ్వనున్న కమిటీలు ● కమిటీల నివేదిక ఆధారంగా ప్రజాక్షత్రంలోకి జాగృతి వెళ్లేలా నిర్ణయం



**హైదరాబాద్,కలంకౌంటర్ :** రెండు దశాబ్దాలుగా తెలంగాణ సాంస్కృతిక వికాసానికి, చారిత్రక వారసత్వ సంపద పరిరక్షణకు, వివిధ వర్గాల ప్రజల సంక్షమానికి కృషి చేస్తోన్న తెలంగాణ జాగృతి రాష్ట్రంలోని అట్టడుగు వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం అడుగులు వేయనున్నది. తెలంగాణ రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం బ్లూ ప్రింట్ రూపొందించడంలో నిమగ్నమయ్యింది జాగృతి జనంబాటలో భాగంగా ప్రజాక్షత్రంలోకి వెళ్తోన్న తెలంగాణ జాగృతి అధ్యక్షరాలు కల్వకుంట్ల కవిత గారికి ఉద్యమకారులు, వివిధ వర్గాల ప్రజల నుంచి తెలంగాణకు స్వీయ రాజకీయ అస్తిత్వం అవసరమని సూచనలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ప్రస్ఫుటింపజేసేలా రాజకీయ కార్యాచరణ ప్రకటిస్తానని.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో స్వీయ రాజకీయ శక్తిగా నిలుస్తామని కవిత గారు స్పష్టం చేశారు. తెలంగాణ జాగృతి రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గం మంగళవారం (ఈనెల 6న) సమావేశం అయి భవిష్యత్ కార్యాచరణపై చర్చించింది. ప్రజాస్వామిక పద్ధతిలో అన్నివర్గాల ప్రజల ఆకాంక్షలను ప్రతిఫలింపజేస్తూ కమిటీలు ఏర్పాటు చేసి వాటి నివేదికల ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో జాగృతి ముఖ్య నాయకులు బుధవారం సమావేశమై "పుష్కరకాల తెలంగాణ రాష్ట్రం ఉ సంపూర్ణ అధ్యయనం" సహా 30 కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. దేశంలోని, రాష్ట్రంలోని వివిధ రాజకీయ పార్టీల రాజ్యాంగాలను స్టడీ చేసి జాగృతికి ప్రజాస్వామ్యబద్ధమైన, పటిష్టమైన రాజ్యాంగాన్ని రూపొందించడానికి న్యాయ నిపుణులతో కమిటీ ఏర్పాటు చేశారు.

# రామాయపట్నం పోర్ట్ ప్రకాశం జిల్లాకే తలమానికం - కలెక్టర్ పి రాజాబాబు

## పోర్టు ద్వారా ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి అవకాశాలు




**కందుకూరు,కలంకౌంటర్ :** ప్రకాశం జిల్లాకు తలమానికంగా మారనున్న రామాయపట్నం పోర్ట్ మొదటి విడత నిర్మాణ పనులు దాదాపు 80 శాతం పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ .పి.రాజాబాబు తెలిపారు. బుధవారం ఆయన రామాయపట్నం పోర్టును సందర్శించారు. పోర్టు నిర్మాణ పనులు, భూ సేకరణపై సంబంధిత అధికారులతో తొలుత కందుకూరు సబ్ కలెక్టర్.హిమవంశీతో కలిసి ఆయన సమీక్షంచారు. ఆయా పనులలో పురోగతిని అధికారులు, పోర్టు నిర్మాణ కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టరుకు వివరించారు. పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని వారిని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం సముద్రంలోకి వెళ్లి బెర్తుల పనులను కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ ఇటీవల జరిగిన జిల్లాల పునర్విభజనలో భాగంగా కందుకూరు డివిజన్ పరిధిలోని కందుకూరు, గుడ్లూరు, ఉలవపాడు, లింగసముద్రం, వలేటివారిపాలెం 5 మండలాలు ప్రకాశం జిల్లాలో కలవడంతో అందులో భాగంగా నిర్మాణంలో ఉన్నటువంటి రామాయపట్నం పోర్టు కూడా ప్రకాశం జిల్లా పరిధిలోకి రావడం జరిగిందన్నారు. రామాయపట్నం పోర్టు పనుల పురోగతిని పరిశీలించేందుకు మొదటిసారిగా రావడం జరిగిందన్నారు. పోర్టు పనులపై జిల్లా కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేస్తూ పోర్టుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియ కూడా దాదాపు పూర్తి కావడం జరిగిందన్నారు. మొదటి విడత పనులు దాదాపు 80 శాతం పూర్తి కావడం జరిగిందని తెలిపారు. ఈ సంవత్సరం ఏప్రిల్ నాటికి పోర్టు పనులు పూర్తి చేసి ప్రభుత్వానికి అప్పగించే విధంగా నిర్మాణ సంస్థ అయిన నవయుగ కంపెనీ పనిచేస్తున్నదన్నారు. ప్రకాశం జిల్లాకు రామాయపట్నం పోర్టు తలమానికంగా మారనున్నదని, ఈ పోర్టు అందుబాటులోకి వస్తే దాని అనుబంధంగా వివిధ కంపెనీలు రావడంతో ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. పోర్టుతో పాటు బిపిసిఎల్ రిఫైనరీ రావడం జరుగుతుందని, ఇప్పటికే వైజాగ్ లో ఒక బిపిసిఎల్ రిఫైనరీ ఉందన్నారు. రాష్ట్రంతో పాటు ప్రకాశం జిల్లాకు రామయపట్నం, బిపిసిఎల్ ప్రాజెక్టులు చాలా ప్రాధాన్యమైనవిగా చెప్పుకోవచ్చున్నారు. పోర్టు నిర్మాణం త్వరగా పూర్తి చేసేందుకు ప్రభుత్వ పరంగా అవసరమైన సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని, రెవెన్యూ అధికారులు ఇక్కడ అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు. అనంతరం నిర్వాసిత ప్రజలకు తెట్టులో నిర్మించిన పునరావాస కాలనీని కలెక్టర్ సందర్శించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట కోర్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజశేఖర్, నవయుగ కాంట్రాక్టర్ కంపెనీ ప్రతినిధి నారాయణ, మ్యారీ టైమ్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శివరాం, బీపీసీఎల్, ఇండోసోల్ కంపెనీల ప్రతినిధులు, స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కలంకౌంటర్ దినపత్రిక స్టేట్ క్యాలెండర్ ను ఆవిష్కరించిన ఆర్టీవో టీవీఎన్ లక్ష్మ




**కందుకూరు, కలంకౌంటర్ :** దినపత్రిక 2026 క్యాలెండర్ ను కందుకూరు ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయము నందు ప్రాంతీయ రవాణా శాఖ అధికారి శ్రీమతి టీవీఎన్ లక్ష్మ చేతులు మీదుగా క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలం కౌంటర్ దినపత్రిక పాఠకులకు ఆమె నూతన సంవత్సర సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కలంకౌంటర్ దినపత్రిక దినదిన అభివృద్ధి చెందాలని ఆమె ఆకాంక్షంచారు. అనంతరం ఆర్టిఓ నాగలక్ష్మ ని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కలంకౌంటర్ దినపత్రిక స్టేట్ కోఆర్డినేటర్ డాక్టర్ చక్కా వెంకట కేశవరావు, శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ రవ్వా శ్రీనివాసులు, మానవతా స్వచ్ఛంద సేవ అధ్యక్షులు గుర్రం చిన్న అల్లురయ్య(+జూా), శ్రీరాము సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ఈసీ మెంబర్ ఇన్నమూరి శ్రీనివాసులు, చక్కా చైతన్య గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# మట్టిలోని మాణిక్య క్రీడాకారులకు అండగా నిజామ్

- నేషనల్ ఖో ఖో ఆడే క్రీడాకారులకు బాసటగా జెర్సీ లు అందజేత
- నేటిబాలలే రేపటి పౌరులుగా ఉండటానికి చేస్తున్న కృషి వర్ణనాతీతం
- చిన్ననాటి నుండి మన దేశానికి, రాష్ట్రానికి పేరు తీసుకురావటానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలి



**బాపట్ల (బాపట్ల జిల్లా),కలంకౌంటర్ :** సాధారణంగా పట్టణాలకు పట్టుకొమ్మలే పల్లెటూర్లు. గతం లో పల్లెటూర్లలో పుట్టినవారే నేడు పట్టణాలలో ఉంటూ జీవనం సాగిస్తున్నారు.ఎక్కడైనా ఉన్నత స్థానంలో ఉన్నవారైన వారు గతంలో పల్లెటూరులో పుట్టి పెరిగిన వారే అనేది నగ్న సత్యం. కొందరు ఉన్నత స్థానంలో ఉన్న వారు కూడా ఇప్పుడు జన్మస్థలలు మారుస్తున్నారు అనేది బహిరంగ రహస్యం. కానీ నేను పుట్టిన ప్రాంతం నాకు ముఖ్యం అంటూ చందోలు గ్రామానికి చెందిన నిజామ్ తన ఔన్నత్యం చాటుకుంటున్నారు. పేదలకు కూడా సాయం చేస్తూ అందరి వాడిగా ప్రసిద్ధి పొందుతున్నాడు. అంతే కాదు ఈ నెలలో జరిగే నేషనల్ ఖో ఖో క్రీడలకు ఎంపికైన విద్యార్థులకు తన సేవ గుణం చూపారు. అండర్14 విభాగం లో గుజరాత్ లోజరిగే ఖో ఖో క్రీడలకు విద్యార్థులు, విద్యార్థినులు పాల్గొంటారు. వీరికి ఒక ప్రముఖ వ్యాపార దిగ్గజ సంస్థ రిఖా వ్యాలీ డైరెక్టర్, బాపట్ల తెలుగు యువత అధ్యక్షుడు నిజామ్ క్రీడా జెర్సీ లను తన రాజకీయ గురువు, మార్గదర్శి అయిన బాపట్ల శాసనసభ్యులు లివేగేసిన నరేంద్రవర్మ మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన వేగేసిన నరేంద్ర మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి కఠోరదీక్షతో,క్రమశిక్షణ తో క్రీడలు ఆడాలి అన్నారు. జీవితంలో గెలుపు ఓటములు ఎలా ఉంటాయో వాటిని గుర్తించి మనం ముందుకు సాగి విజయం సాధించాలి అన్నారు. చిన్న నాటు నుండి మనం ఎంత కష్టపడి తే అంత ప్రతి ఫలం దక్కుతుంది అన్నారు. మీరు విజయం సాధిస్తే మన ప్రాంతంపై ప్రతి ఒక్కరికి మక్కువ పెరిగి, గౌరవం కూడా పెరుగుతుంది అన్నారు. మట్టిలో మణిక్యాల ప్రతిభ ప్రతి ఒక్కరికి చూపాలి అని అన్నారు.అంతే కాకుండాఎంత ఎదిగిన ఒదిగి ఉండాలి అని నిజామ్ ని చూసి ప్రతి ఒక్కరు నేర్చుకోవాలి అన్నారు. ఇలాంటి సేవ చేయటం ఒక అదృష్టం అన్నారు. మనం ఎంత సంపాదించమ అనేది ముఖ్యం కాదు మనం ఎంత సేవ చేసాం అనేది ముఖ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ కావూరి శ్రీనివాస రెడ్డి,బాపట్ల పరిశీలకుడు సాంబి రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ గోదా దేవి అమ్మవారికి సారి సమర్పణ




**కందుకూరు,కలంకౌంటర్ :** కందుకూరు పట్టణంలో పెద్ద బజారు నందు ఉన్న శ్రీ వేణుగోపాలకృష్ణ ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా ఈరోజు ఆలయ ప్రెసిడెంట్ గొల్ల వెంకన్న ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహిళలు, భక్తులందరూ కలిసి శ్రీ గోదా దేవి అమ్మవారికి వైభవంగా సారె ను సమర్పించారు. ఉదయం అన్నా కాంటీన్ వద్ద ఉన్న అశ్వర్థ నారాయణ వృక్షం వద్ద ఆలయ అర్చకులు పవన్ స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడి నుంచి ఊరేగింపుగా బ్యాంకు బజార్ మీదుగా శ్రీ వేణుగోపాలకృష్ణ ఆలయం నకు మహిళలు పెద్ద ఎత్తున అమ్మవారికి సారె సమర్పించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజీల పీపీపీ అంశంలో కీలక మలుపు.. హైకోర్టులో వైసీపీ పిల్

- పీపీపీ ద్వారా 17 కాలేజీలను నిర్వహించేందుకు సిద్ధమైన ప్రభుత్వం
- ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నడిపించాలని హైకోర్టులో వైసీపీ పిల్
- ఈరోజు విచారణ చేపట్టనున్న ఏపీ హైకోర్టు

**అమరావతి, కలంకౌంటర్ :** ఏపీలోని 17 మెడికల్ కళాశాలలను పీపీపీ ద్వారా నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వీటిని పూర్తిగా ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నడిపించాలని కోరుతూ ఏపీ హైకోర్టులో వైసీపీ పబ్లిక్ ఇంటరెస్ట్ లిటిగేషన్ (పిల్) దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై ఇవాళ న్యాయస్థానం విచారణ చేపట్టనుంది. ప్రజలకు ఉచితంగా, మెరుగైన వైద్య సేవలు అందించేందుకే ఈ మెడికల్ కళాశాలలను తాము ఏర్పాటు చేశామని వైసీపీ తన పిటిషన్‌లో పేర్కొంది. ప్రైవేట్ వ్యక్తులు లేదా సంస్థల జోక్యం ఉండకూడదని, అలా జరిగితే పేదలకు వైద్య విద్యా అవకాశాలు దూరమవుతాయని ఆ పార్టీ వాదిస్తోంది. అప్పటి ప్రభుత్వం ఈ కళాశాలల నిర్వహణకు బడ్జెట్ భారం లేకుండా చూసుకునేలా విధానాలు రూపొందించిందని, కొన్ని సీట్లను మాత్రమే డొనేషన్‌కు కేటాయించి ఆ ఆదాయాన్ని ఆసుపత్రుల అభివృద్ధికి వినియోగించేలా మార్గదర్శకాలు తయారు చేసిందని కోర్టుకు పిల్ లో వివరించింది. పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) మోడల్‌లో ఈ కళాశాలలను నడిపిస్తే వైద్య విద్య మాత్రమే కాకుండా, సామాన్యులకు వైద్య సేవలు కూడా అందుబాటులో ఉండవని, అవి కొనుక్కోవాల్సిన పరిస్థితి వస్తుందని వైసీపీ తన పిల్‌లో ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వం చెబుతున్నట్టు ఆర్థిక భారం ఎక్కువగా ఉందన్నది వాస్తవం కాదని, ఇందుకు సంబంధించి ప్రజల అభిప్రాయం తెలుసుకోవడానికి కోటి




సంతకాలు సేకరించామని కూడా కోర్టుకు తెలిపింది. టెండర్ల ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేయాలంటూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని అనుబంధ పిటిషన్ కూడా దాఖలు చేసింది. ప్రతివాదులుగా రాష్ట్ర ప్రభుత్వం, ఏపీఎంఎస్ఐడీసీ, ఏపీ మెడికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్, నేషనల్ మెడికల్ కౌన్సిల్‌లను వైసీపీ చేర్చింది.

# మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అనుచరుల భూ కబ్జాలపై గ్రీవెన్స్ లో ఫిర్యాదు

- వైసీపీ నేతల దౌర్జన్యం.. 30 ఏళ్ల సాగు భూమిని అక్రమంగా స్వాధీనం
- చట్టబద్ధ భూముల హద్దులు చూపించడంలో అవరోధాలు సృష్టిస్తున్న వైసీపీ నాయకులు
- బి.కొత్తకోటలో వైసీపీ నేతల అక్రమాలు.. చర్యలు తీసుకోవాలంటూ వినతి
- వైసీపీ ప్రభుత్వ హయాంలో రిటైర్డ్ ఎయిర్ ఫోర్స్ జవాన్ భూమిని చెరువు తవ్వకంతో కబ్జా
- టీడీపీ కేంద్ర కార్యాలయంలో అర్జీలు స్వీకరించిన రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ అశోక్ బాబు



**మంగళగిరి, కలంకౌంటర్ :** నంద్యాలకు చెందిన చెన్నమ్మ నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో నేతలకు అర్జీ ఇచ్చి అభ్యర్థిస్తూ.. మహానంది మండలం బుక్కాపురం గ్రామ పంచాయితీ పరిధిలోని ఫారెస్ట్ భూముల విషయంలో తీవ్ర అన్యాయం జరుగుతుంది. తెలుగుగంగ ప్రధాన కాలువ పరిధిలో మహానంది, బుక్కాపురం, కడమల, తిమ్మాపురం గ్రామాల మధ్య దాదాపు 500 ఎకరాల ఫారెస్ట్ భూమి ఉంది. ఇందులో మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అనుచరులు బెదిరింపులతో భూములను అక్రమంగా స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయమై పలుమార్లు కలెక్టర్, అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేదు. మహానంది పరిధిలోని సర్వే నెంబర్లు 681, 797, 798, 799, 800, 809, 810లలో 87 ఎకరాలు 31 సెంట్లు, అలాగే తిమ్మాపురం సర్వే నెం.169లో 16 ఎకరాలు 80 సెంట్లు భూమి ఉంది. అయితే 27 మంది దళిత కుటుంబాలకు ఒక్క సెంటు భూమి కూడా లేదు. కావునా వారిపై చర్యలు తీసుకోని ప్రభుత్వ భూములను కాపాడాలని నేతలు రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ కేంద్ర కార్యాలయ కార్యదర్శి పర్చూరి అశోక్ బాబులకు అర్జీ ఇచ్చి అభ్యర్థించారు. సత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం గంటాపురం గ్రామానికి చెందిన నారాయణ స్వామి గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలో సర్వే నెం.103/1ఉఎ1లో 75 సెంట్ల మెట్ట భూమి కలదు. ఈ భూమిని తాము గత 30 సంవత్సరాలుగా నిరంతరం అనుభవంలో ఉంచుకొని సాగు చేస్తున్నాము. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత అధికారుల సహకారంతో వైసీపీ నేతలు ఈ భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకున్నారు. 2021లో తమ అనుభవంలో ఉన్న భూమిని నిలిపివేసి తమకు హక్కు లేకుండా చేశారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి న్యాయం జరగలేదు. కావునా వారిపై చర్యలు తీసుకోని తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరాడు. అనంతపురం జిల్లా ఆత్మకూరు మండలం ముదిగుబ్బ గ్రామానికి చెందిన నాగరాజు గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తన కుటుంబానికి చట్టబద్ధంగా మంజూరైన వ్యవసాయ భూములకు సంబంధించి ఇప్పటివరకు కొలతలు, హద్దులు చూపడం లేదు. తమ తండ్రి చిన్న అక్కులన్న కుటుంబానికి చెందిన సర్వే నెంబర్లు 286-3, 298-3-1, 298-3-2, తలారి రాధ గారికి చెందిన 298-2, 298-6, 298-8 భూములపై ప్రభుత్వ పాసు పుస్తకాలు, ఖాతాలు ఉన్నప్పటికీ, స్థానికంగా వైసీపీ నేతలు హేమలమ్మ, వెంకటేష్, శంకర్ నాయక్ లు దౌర్జన్యంగా అడ్డుకుంటూ కొలతలు జరగనివ్వడం లేదు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదు. కావునా వారిపై చర్యలు తీసుకోని తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరాడు. అన్నమయ్య జిల్లా బి.కొత్తకోటకు చెందిన సురేంద్ర బాబు గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలో శ్రీ చెన్నకేశవస్వామి దేవస్థానానికి సంబంధించిన సర్వే నెం.1847 లో గల భూముల్లో గత వైసీపీ ప్రభుత్వం కాలంలో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిగాయి. దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే 2023ఉ2026 కాలానికి వేలం ద్వారా సర్వే నెం.1847-1 ను పాడుకొన్నప్పటికీ, ఇప్పటివరకు దేవదాయశాఖ అధికారులు భూమిని చూపించకపోవడం అన్యాయంగా మారింది. అలాగే వైసీపీకి చెందిన వ్యక్తులు దేవస్థాన భూమిలో 10 సెంట్లు అక్రమంగా ఆక్రమించడం అలాగే సర్వే నెం.847లో నిర్మాణాలు చేపట్టారు. ఈ అక్రమాలపై తక్షణమే విచారణ జరిపి ఆక్రమణలు తొలగించి దేవస్థాన భూములను పరిరక్షించాలని కోరాడు. పశ్చిమ గోదావరి జిల్లా ఇరగవరం మండలం ఐనపర్రు గ్రామానికి చెందిన కర్రి గోపిరెడ్డి గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. 1999 కార్గిల్ యుద్ధ సమయంలో ఎయిర్ ఫోర్స్‌లో బాధ్యతలు నిర్వర్తించి, 20 సంవత్సరాలు సేవలందించి రిటైర్ అయిన జవాన్‌ను. ఎయిర్ ఫోర్స్‌లో పనిచేస్తున్న సమయంలోనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ద్వారా సర్వే నెం.194/3లో 3 ఎకరాల బంజరు భూమిని (ఆర్.సి. నెం.145/97/బి, తేది 31-05-1999, డీ ఫారంఉ7) తమ పేరున మంజూరు చేశారు. ఆ భూమిని ఎంతో ఖర్చు చేసి అభివృద్ధి చేసి సాగులోకి తీసుకువచ్చాను. అయితే 2019లో అప్పటి వైసీపీ ప్రభుత్వం ఆ భూమిలో చెరువు తవ్వి, తమకు పొలం లేకుండా చేసింది. అప్పట్లో అధికారులు వేరే చోట భూమి కేటాయిస్తామని హామీ ఇచ్చినా ఇప్పటివరకు అమలు కాలేదు. కావునా వారిపై చర్యలు తీసుకోని తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరాడు. ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం శివన్నపాలెం గ్రామానికి చెందిన రామకృష్ణ గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తాళ్లూరు మండలం వాగుకాయలపాడు రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్లు 383/11, 333/3, 384 లలో మొత్తం 13.24 సెంట్లు పూర్వికుల భూమి తమ చట్టబద్ధంగా ఉంది. ఈ భూమికి సంబంధించిన పాస్ బుక్, రికార్డులు, అడంగల్, ఆన్‌లైన్ ఎంట్రీలు తమ తాత పేరుపై ఉన్నాయి. అయితే గత ప్రభుత్వంలో 2021 జూన్‌లో ఎలాంటి హక్కు పత్రాలు లేని రామచంద్రయ్య, కోయి లింగయ్య తదితరుల పేర్లపై అక్రమంగా ఎక్కించేందుకు ప్రయత్నాలు చేశారు. దీనిని నేను తీవ్రంగా వ్యతిరేకించగా అప్పటి సర్వేయర్ శివ, ఎంఆర్‌ఓ బ్రహ్మయ్య గారు తమ భూమిని చూపించకుండా అక్రమాలకు సహకరించారు. ఫిర్యాదు చేసినప్పటికీ వారు ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డితో చెప్పించడంతో పోలీసు శాఖ వైపు నుంచి సరైన న్యాయం జరగలేదు. సర్వే నెం.384లోని 4.69 సెంట్లలో 1.50 సెంట్ల భూమిని, అలాగే ఇతర భూములను కందిమళ్ల కోటేశ్వరరావు, బ్రహ్మయ్య పేర్లపై అక్రమంగా ఆన్‌లైన్‌లో మార్చారు. కావునా వారిపై చర్యలు తీసుకోని తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరాడు. సత్యసాయి జిల్లా ధర్మవరం మండలం ముచ్చురామ గ్రామానికి చెందిన కృష్ణయ్య గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలో సర్వే నెం.15లో ఉన్న భూమికి సంబంధించి గత వైసీపీ ప్రభుత్వ కాలంలో బోసే లక్ష్మణ అనే వ్యక్తికి అనుకూలంగా అప్పటి ఎంఆర్‌ఓ ఒక్కరికే ఏకపక్షంగా సబ్ డివిజన్ చేశారు. ఈ అన్యాయంపై హైకోర్టును ఆశ్రయించగా కోర్టు ఆదేశాలతో ఆ సబ్ డివిజన్ రద్దు చేయబడింది. అయినప్పటికీ కోర్టు నిర్ణయం ప్రకారం అందరికీ సమానంగా సబ్ డివిజన్ చేయాలని కోరుతూ ధర్మవరం ఆర్డీఓ/ఎంఆర్‌ఓ కార్యాలయాలను పలుమార్లు కలిసినా అధికారులు పట్టించుకోవడం లేదు. కావునా వారిపై చర్యలు తీసుకోని తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరాడు. సత్యసాయి జిల్లా ఓబుళదేవరచెరువు మండలం తిప్పేపల్లి గ్రామానికి లక్ష్మి దేవి గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తన భర్త డీ. రామాంజనేయులు గత 20 ఏళ్లుగా టీడీపీలో క్రియాశీలకంగా పనిచేశారు. ఆయన మరణానంతరం తనకు చట్టబద్ధంగా వచ్చిన పట్టాదారు పాసుబుక్ ఆధారంగా భూమిని అనుభవంలో ఉంచుకొని, బ్యాంకు రుణాలు తీసుకొని సక్రమంగా చెల్లింపులు కూడా చేస్తున్నాను. అయితే ఎలాంటి హక్కు లేని కొంతమంది బంధువులు తమ మీద తప్పుడు ఫిర్యాదులు చేసి, ఆర్డీఓ గారి ద్వారా తమ పట్టాదారు పాసుబుక్‌ను అక్రమంగా రద్దు చేయించారు. తమ వద్ద అన్ని చట్టబద్ధమైన పత్రాలు సక్రమంగా ఉన్నాయి. వాటి నకళ్లను కూడా సమర్పించాను. అయినప్పటికీ ఇప్పటివరకు న్యాయం జరగలేదు. కావునా వారిపై చర్యలు తీసుకోని తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరారు.

# 3380 కోట్లతో రహదారుల నిర్మాణం

**● ఫిషింగ్ హార్బర్ కు నడకుదుటి నరసింహారావు పేరు ● రాష్ట్ర మంత్రి బి సి జనార్ధన్ రెడ్డి**



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒకే సంవత్సరం 3,380 కోట్ల రూపాయల వ్యయంతో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ రహదారుల నిర్మాణము, మరమ్మతు పనులు చేపట్టామని రాష్ట్ర రహదారులు, భవనాలు, మౌలిక సదుపాయాలు,పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి వెల్లడించారు. బుధవారం మధ్యాహ్నం నగరంలోని కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో రాష్ట్ర రహదారులు భవనాలు, మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడుల శాఖ మంత్రి, రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, సంయుక్త కలెక్టర్ ఎం నవీన్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు లతో కలిసి బందరు ఓడరేవు, ఫిషింగ్ హార్బర్ నిర్మాణం పనులు రహదారులు భవనాల శాఖ పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన అనంతరం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రంలో రహదారుల నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. తద్వారా రాష్ట్రానికి పలు పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు రావడానికి మార్గం సుగమం చేశామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,081 కోట్ల రూపాయల వ్యయంతో 16వేల కిలోమీటర్ల మేరకు రహదారుల మరమ్మతులు, గుంతలు పూడ్చే కార్యక్రమం పూర్తి చేశామన్నారు. రాష్ట్ర చరిత్రలో ఒకే సంవత్సరం 3,380 ఓట్ల రూపాయల వ్యయంతో రహదారుల నిర్మాణం చేపట్టామని, ఇందుకోసం టెండర్లు ఇప్పటికే పిలిచామని, మరికొన్ని ఒప్పందాలు జరుగుతున్నాయని, మరికొన్ని పనులు మొదలయ్యాయనీ చెబుతూ అన్ని కూడా నాణ్యతలో ఏమాత్రం లోటు లేకుండా వచ్చే మే నెల ఆఖరిలోగా పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో 160 కోట్ల రూపాయల వ్యయంతో 1,518 కిలోమీటర్ల మేరకు గుంతలు పడిన రహదారులను పూడ్చటంతో పాటు ఇతర మరమ్మతులను పూర్తి చేయడం జరిగిందన్నారు. అందులో మచిలీపట్నం నియోజకవర్గంలో 33 కోట్ల రూపాయల వ్యయంతో 166 కిలోమీటర్ల రహదారుల మ-రమ్మతు పనులు చేపట్టడం జరిగిందన్నారు. అలాగే జిల్లాలో రహదారుల మరమ్మతుకు గాను పామర్రు నియోజక వర్గానికి 28 కోట్ల రూపాయలు, గన్నవరం నియోజకవర్గానికి 27 కోట్ల రూపాయలు, గుడివాడ నియోజకవ ర్గానికి 16 కోట్ల రూపాయలు, అవనిగడ్డ నియోజకవర్గానికి 20 కోట్ల రూపాయలు, పెనమలూరు నియోజకవర్గానికి 15 కోట్ల రూపాయలు, పెడన నియోజకవర్గానికి 26 కోట్ల రూపాయలు మంజూరు చేశామన్నారు. ఈ నిధులతో పనులు రహదారుల మరమ్మతు పనులు ముమవరంగా ముమ్మరంగా చేపట్టి త్వరలో పూర్తి చేస్తామన్నారు. బందరు ఓడరేవు నిర్మాణాన్ని 50 శాతం పైగా పూర్తయిందని, ఇప్పటిదాకా 1760 కోట్ల రూపాయలు ఖర్చు అయినదని, ఈ సంవత్సరం డిసెంబర్ నాటికి కచ్చితంగా పూర్తి చేస్తామన్నారు. ఇంకా 1700 కోట్ల రూపాయల మేరకు 42 శాతం పని మిగిలి ఉందని ఉందన్నారు.ఇకపై ప్రతినెలా సమీక్షంచి ఎంత శాతం మేరకు పని పూర్తయిందో తెలుసుకుంటామన్నారు. గిలకలదిండి ఫిషింగ్ హార్బర్ నిర్మాణంలో. సాంకేతిక పరంగా కొన్ని సమస్యలు వచ్చాయ, ఈ సంవత్సరం జూన్ నెలాఖరికి పూర్తి చేస్తామన్నారు..ఈ ప్రాంత వాసి హార్బర్ కోసం కృషిచేసిన పూర్వపు మంత్రి నడికుదుటి నరసింహారావు పేరును హార్బర్ కు పెట్టేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి సుముకత వ్యక్తం చేసి ప్రభుత్వ ఉత్తర్వులను కూడా జారీ చేశారన్నారు.మచిలీపట్నంతో పాటు జిల్లా ప్రజలందరి తరపున రాష్ట్ర ముఖ్యమంత్రి కి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి హార్బర్ నిర్మాణం పురోగతిని సమీక్షంచి త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ మచిలీపట్నం నియోజకవర్గంలో 46 కోట్ల రూపాయల వ్యయంతో పలు రహదారుల నిర్మాణ పనులు చేపట్టామన్నారు. ఇందుకోసం నిధులు మంజూరు చేసిన మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. గత 5 సంవత్సరాల్లో అప్పటి ప్రభుత్వం రహదారుల నిర్మాణం కానీ, మరమ్మతు గాని పట్టించుకోలేదన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రవ్యాప్తంగా 1,000 కోట్ల రూపాయలను ఖర్చు చేసి రహదారుల మరమ్మతు ముఖ్యంగా గుంతలు పడిన రహదారులను పూడ్చివేశామన్నారు. మచిలీపట్నం ఓడరేవు నిర్మాణం ఈ సంవత్సరం డిసెంబర్ నాటికి పూర్తయి, కార్యకలాపాలు మొదలవుతాయన్నారు. ఇప్పటివరకు కొన్ని ఇబ్బందులు ఉన్నాయని ఇకపై ప్రతి మూడు నెలలకు ఒకసారి పురోగతిని సమీక్షంచి నిర్మాణం పనులు వేగవంతం చేస్తామన్నారు. గిలకలదిండి ఫిషింగ్ హార్బర్ నిర్మాణంలో సి మౌత్ కు సంబంధించి సరైన ఆకృతి లేక కొంత ఆలస్యమైందని ప్రస్తుతం చెన్నై ఐఐటీ నుండి ఆకృతులు వచ్చాయని ఇక పనులు వేగవంతం చేస్తామన్నారు. వచ్చే మార్చి నెల 15 వ తేదీ నుండి వేట నిషేధం మొదలవుతుందనిఞ, జూన్ 15 నుండి హార్బర్ కార్యకలాపాలు మొదలయ్యేలా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో 1999లో హార్బర్ నిర్మాణానికి కృషిచేసిన మాజీ మత్స్యశాఖ మంత్రి నడికుదిటి నరసింహారావు పేరిట హార్బర్ కు నామకరణం చేస్తూ ప్రభుత్వం జీ.వో. విడుదల చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రికి, మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ కే చంద్రశేఖర రావు, డీసీఎంఎస్ అధ్యక్షులు బండి రామకృష్ణ, బందరు ఓడరేవు సి ఈ రాఘవరావు ఎస్సీ నగేష్ ఈఈ వి పుల్లారావు, రహదారులు భవనాల శాఖ సీఈ ఎన్ శ్రీనివాసరెడ్డి, ఎస్ ఈ భాస్కర్, ఈ ఈ లోకేష్, మెగా ఇంజనీరింగ్ లిమిటెడ్ ఇంచార్జ్ అధికారి తులసీదాసు వచ్చే శాఖ జేడి మత్స్యశాఖ జేడీ అయ్యా నాగరాజా తదితర అధికారులు పాల్గొన్నారు.

# ప్రతిభ కనబరిచిన విద్యార్థినిలకు బహుమతులు









**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం లేడీ యాంప్తిల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం మార్చి 2025 లొ జరిగిన పబ్లిక్ పరీక్షలలొ 9 గ్రూపులలో ప్రతిభ కనబరిచిన 36 మందికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎల్. సత్యనారాయణ కుటుంబ సభ్యులు 30 వేల రూపాయలు ఖరీదు చేసే మిల్టన్ లంచ్ బాక్స్ సెట్లను లంకిశెట్టి పాండురంగ ప్రసాదరావు విన్నకోట విద్యా వినోద రావు పేరున అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పి లక్ష్మ మాట్లాడుతూ స్టూడెంట్స్ ను ప్రోత్సహిస్తూ పది సంవత్సరాల నుండి లంకిశెట్టి ఫ్రెండ్ సర్కిల్ సభ్యులు అనేక రకాలుగా సహాయ సహకారాలు అందిఒచడం విద్యార్థినిలకు ఎంత ప్రోత్సాహంగా ఉంటుందని అన్నారు. ఆడపిల్లలు చదువుకుని ఎదగాలని భవిష్యత్తులో బంగారు భవిష్యత్తు ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీనియర్ న్యాయవాది లంకి శెట్టి బాలాజీ మాట్లాడుతూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా కళాశాలలో సిమెంట్ బెంచీలు ,బార్కెట్లు ఇవ్వటం జరిగిందని తెలియజేశారు .ఇప్పుడు లంకిశెట్టి సత్యనారాయణ కుటుంబ సభ్యులు ప్రతిభ కనపర్చిన విద్యార్థినులకు 30000 ఖరీదు చేసే మిల్టన్ లంచ్ బాక్సులు ఇవ్వడం ద్వారా వారి దాతృత్వం తెలియజేస్తుందని అన్నారు.గత ఏడాది రాష్ట్రంలో రెండో స్థానం పొందిన లేడీ యాంప్తిల్ వచ్చే విద్యా సంవత్సరంలో మొదటి స్థానాన్ని పొందే విధంగా విద్యార్థులు కష్టపడి మంచి మార్కులతో పాస్ కావాలని అన్నారు. నేడు ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు నోటు పుస్తకాలు యూనిఫారం మధ్యాహ్నం భోజన పథకం ఎం.సెట్ మెటీరియల్ అందజేస్తున్నదని ఎంతో అర్హత కలిగిన అధ్యాపకులు కళాశాలలో విద్య ని అందిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అరిసెపల్లి పిఏసిఎస్ విశ్రాంత సీఈవో ఎం. వి.వి. రామాంజనేయులు బాబు అధ్యాపకులు సుందరలక్ష్మ, లంకి శెట్టి హరినాథ్ బాబు, మమత, మున్వర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కళాశాల తరఫున దాత సాఫ్ట్వేర్ ఇంజనీర్ ఎల్ వంశీకృష్ణను శాలువాలతో సన్మానించారు

# చలమలశెట్టి శ్రీకృష్ణ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించిన బండి





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మాజీ కౌన్సిలర్ సమాజ సేవకులు చలమలశెట్టి శ్రీకృష్ణ దశదిన కార్యక్రమంలో పాల్గొన్న జనసేన పార్టీ ఇంచార్జ్ డిసిఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ బుధవారం శ్రీకృష్ణ చిత్రపటానికి పూలమాలను వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం దశదిన కార్యక్రమాన్ని పర్యవేక్షంచారు. ఈ కార్యక్రమంలో కొరియర్ శ్రీను,మాదివాడరాము, గడ్డంరాజు,శాయనశివయ్య, త్రిపురారితరుణ్,కొలపల్లి గణేష్ ,కూనపరెడ్డి ప్రసాద్, నూకల సాయి గణేష్, చలమలశెట్టిరమేష్, దేవనూరి వీరబాబు,బొమ్మదేవర నరసింహనాయుడు,ఊచచంటి,బండిశివ, తోట రాజేష్, తిరుమలశెట్టినాగరాజు,వాల్లే రామినాయుడు,తోట భాస్కర్,కరపఏసు, మంత్రి పృధ్వి, జనసేన పార్టీ ప్రజా ప్రతినిధులు వివిధ హొదాలో ఉన్న నాయకులు వీర మహిళలు పలువురు నగర ప్రముఖులు శ్రీకృష్ణ కుటుంబ సభ్యులు అభిమానులు పాల్గొన్నారు.

# ఘన నివాళులు



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం రేవతి టాకీస్ సెంటర్ నందు స్వర్గీయ వంగవీటి మోహన రంగా విగ్రహం వద్ద రాధా రాధా మిత్రమండలి రెండు తెలుగు రాష్ట్రాల అధ్యక్షులు ఒ జనసేన నాయకులు బుల్లెట్ ధర్మారావు ఆధ్వర్యంలో.త్రిళ్ళ రామ్మోహన్ రావు , చిలకలపూడి కి చెందిన మాజీ కౌన్సిలర్ చలమలశెట్టి శ్రీకృష్ణ కి సంతాప సభ నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలుగుదేశం నాయకులు డాక్టర్ హసీం బేగ్ ,షేక్ మౌలాలీ పాల్గొని వారి చిత్రపటాలకు పూలమాల అలంకరించి ఈ సందర్భంగా హసీం బేగ్ , షేక్ మౌలాలి , బుల్లెట్ ధర్మారావు మాట్లాడా రు.ఈ కార్యక్రమ0 లో మహిళా కమిటీ ఉపాధ్యక్షురాలు బడుగు ఉమాదేవి, సమ్మెట పుష్ప, వన్నెంరెడ్డి కుమారి, కోక్కు ప్రభావతి, మోకా మల్లిక, బాల కుమారి, ఏల్చూరి సుధారాణి, విన్నకోట సుబ్బారావు, కుంచే దత్తాత్రేయులు, వల్లభని శేఖర్, వన్నెంరెడ్డి ప్రసాదు, అబ్దుల్ అజీమ్, ఆదిగిరి, మాదాసు రాంబాబు, కమిలి శివ, నిడదవోలు శ్రీనివాసరావు, మాగంటి బాలాజీ, లంశెట్టి తాండవ కృష్ణ, కొల్లు శ్రీనివాసు, సుబ్బారావు, నాంచారయ్య, బాకీ విజయ్ కుమార్, కాగిత రాంబాబు, తదితరులు పాల్గొని ఘన నివాళులు అర్పించారు.

# కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు..


**● చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలి ● సంయుక్త బృందాలు విస్తృత తనిఖీలు నిర్వహించాలి**

**● గ్రామ, మండల, డివిజన్ స్థాయి కమిటీలు అప్రమత్తంగా ఉండాలి ● ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



**విజయవాడ,కలంకౌంటర్ :**సంక్రాంతి పండగ సందర్భంగా ఎక్కడైనా కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని, చట్టాలపై గ్రామాలు మొదలు జిల్లాస్థాయి వరకు ప్రత్యేక అవగాహన కార్యక్రమా లు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పేర్కొన్నారు.బుధవారం కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్‌లో జిల్లా జంతు సంక్షేమ సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ గౌరవ హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా ఏర్పాటుచేసిన గ్రామ, మండల, డివిజన్ స్థాయి కమిటీలు ప్రజాప్రతి నిధుల భాగస్వామ్యంతో క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. గ్రామ-సభలు నిర్వహించి, చట్టాలపై అవగాహన కల్పించాలని, వీఆర్వో, తహశీల్దార్, ఆర్‌డీవోల సారథ్యం లోని కమిటీలు అప్రమత్తంగా ఉండాలన్నారు. విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించి ఎక్కడా కోడి పందేలు జరక్కుండా చూడాలన్నారు. కోడిపందేలు నిర్వహించడం, పాల్గొనడం చట్టరీత్యా నేరమని.. నిబంధనలు ఉల్లంఘిస్తే ఆంధ్రప్రదేశ్ గేమింగ్ యాక్ట్-1974లోని సెక్షన్-10, జంతు హింస నివారణ చట్టం-1960లోని సెక్షన్ 34 ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు.

# 2047 నాటికి అందరికీ బీమా సౌకర్యం కల్పించేందుకు కృషి:సిఎస్ విజయానంద్



**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్రంలోని ప్రతి పౌరునికి 2047 నాటికి బీమా సౌకర్యాన్ని కల్పించే లక్ష్యంతో భారత బీమా నియంత్రణ మరియు అభివృద్ధి సంస్థ(×=ణూ×) పనిచేస్తోందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పేర్కొన్నారు.బుధవారం రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర స్థాయి ఇన్సూరెన్సు కమిటీ (SLIC) సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది.ఈసమావేశంలో రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలకు బీమా కవరేజీని విస్తరించడానికి దాని ప్రయోజనాలను సామాన్యులకు చేరేలా చేయడానికి అనుసరించాల్సిన వ్యూహాలపై కమిటీ చర్చించింది.అదే విధంగా జీవిత బీమా,పంటల బీమా,మోటారు మరియు ఆరోగ్య బీమాకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడానికి రంగ-నిర్దిష్ట ఉప-కమిటీలను ఏర్పాటు చేయాలని కమిటీ సిఫార్సు చేసింది.ఈ లక్ష్యన్ని సాధించడానికి లీడ్ బీమా సంస్థలు మొదటి విడతలో సుమారు 5,000 గ్రామ పంచాయతీలను దత్తత తీసుకున్నాయి.ఈసందర్భంగా సిఎస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2047 నాటికి దేశంలోని ప్రతి పౌరునికి బీమా సౌకర్యాన్ని కల్పించాలన్న ఐఆర్డిఎఐ లక్ష్యనికి అనుగుణంగా సెర్ప్,మెప్మా,స్వర్ణ గ్రామ,వార్డు విభాగాలతో పాటు కార్మిక,రవాణా,ఎంఎస్ఎంఇ తదితర శాఖలు వారి పరిధిలోని వారందరికీ బీమా సౌకర్యం కల్పించే విధంగా వారిలో అవగాహన కల్పించాలని చెప్పారు.రాష్ట్ర,జిల్లా స్థాయి అధికారులతో దీనిపై పలు సమావేశాలు ఏర్పాటు చేసి వారిలో తగిన అవగాహన కల్పిచి వారి సహకారంతో ఈకార్యక్రమాన్ని పూర్తిగా విజయవంతం చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సిఎస్ విజయానంద్ కమిటీకి సూచించారు. బీమా ఆవశ్యకతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిచేందుంకు అన్ని శాఖల కార్యదర్శులకు,జిల్లా కలక్టర్లకు వెంటనే తగిన ఆదేశాలు జారీ చేయాలని రాష్ట్ర స్థాయిలో ఈకార్యక్రమాన్ని పర్యవేక్షస్తున్నఆర్థికశాఖ అధికారులను సిఎస్ ఆదేశించారు.అంతేగాక వివిధ విభాగాలు రాష్ట్ర స్థాయి నుండి క్షత్రస్థాయి వరకూ ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సిఎస్ విజయానంద్ అన్నిశాఖల అధికారులను ఆదేశించారు. రాష్ట్ర స్థాయి బీమా కమిటీ నియంత్రణ సంస్థ (IRDAI), రాష్ట్ర ప్రభుత్వం మరియు బీమా కంపెనీలతో కూడిన త్రైపాక్షక సంస్థాగత యంత్రాంగంగా ఏర్పాటు చేయబడింది.బ్యాంకింగ్ రంగంలో ఎస్ఎల్బిసి పాత్ర మాదిరిగానే బీమా రంగంలో అత్యున్నత ప్రమాణాన్ని ఏర్పాటు చేయడం దీని లక్ష్యం.ఈ కమిటీ రాష్ట్రవ్యాప్తంగా బీమా కవరేజీని అంచనా వేసి ఐఆర్డిఎఐ"2047 నాటికి అందరికీ భీమా"అనే లక్ష్య స్థాధనకు అనుగుణంగా బీమా వ్యాప్తిని మరింతగా పెంచే చర్యలను సిఫార్సు చేస్తుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఐఆర్డిఎఐ నియమించిన మూడు ప్రధాన బీమా సంస్థల్లో ాచీదీ వీమాఅటవ,స్టార్ హెల్త్ మరియు యూనివర్సల్ సోంపో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలు ఉన్నాయి. ఈసమావేశంలో ఆర్థికశాఖ ఉప కార్యదర్శి సూరజ్ ధనంజయ్, ఐఆర్డిఎఐ డిజిఎం పార్ధ సారధి,యూనివర్సల్ సాంపూ నీకాస్ డేకా హెడ్ ఎస్.రాజేశ్,ఎస్ఎంఇ ఇన్సూరెన్స్ ఇన్లూక్లూజన్ మరియు స్టార్ హెల్తు బిబి శ్రీనివాస్ బిజినెస్ హెడ్ మరియు సాగర్ పాల,పిఎన్బి మెట్లైఫ్ సిద్దార్ధ్ మరియు శ్రీనివాసరావు క్లస్టర్ మేనేజర్,ఎస్ఎల్బిసి చీఫ్ మేనేజర్ జి.లక్ష్మనారాయణ తదితరులు పాల్గొన్నారు.అదే విధంగా వర్చువల్ గా రాష్ట్ర సర్వీసెస్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.రావత్,రాష్ట్ర ఎంఏయుడి ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్, హెూంశాఖ ముఖ్యకార్యదర్శి కుమార్ విశ్వజిత్,సిఇఓ ఎంఎస్ఎంఇ విశ్వ తదితరి అధికారులు పాల్గొన్నారు.

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com